
## శ్రీ చంద్రఫామ్స్ & రిసార్ట్స్ ఇండియా లిమిటెడ్ – నవ్య వీక్లీ కథల పోటీలో
# విశేష బహుమతి రూ. 2,000 పొందిన కథ

‘అయ్యో కాఫీ అన్నా తాగకుండా ఇంత పొద్దుటే ఎక్కడికండీ ఆ పరుగు?’ కామేశ్వరమ్మ మొగుడు శంకర్రావుని నిలదీసింది. ఆవిడకి ఈ మధ్య శంకర్రావుగారి ధోరణి బొత్తిగా అంతుపట్టకుండా పోయింది. రిటైర్మెంటు దగ్గర పడుతున్నకొద్దీ ఈ పెద్దమనిషి ప్రవర్తన విచిత్రంగా అనిపిస్తోంది ఆవిడకి.

రోజూ ఏడున్నరకి లేచి గ్లాసుడు చిక్కని కాఫీ తాగనిదే మంచం దిగని భర్తగారు ఇలా తెల్లారకుండానే నిద్రలేచి కొత్తగా కొనుక్కు తెచ్చుకున్న తెల్లని మల్లెపువ్వు లాంటి వాకింగ్ డ్రెస్సు, బూట్లు వేసుకుని పచ్చిమంచినీళ్లన్నా తాగకుండా పరుగుతియ్యడానికి ఉరకలు వేస్తూ వెళ్లడం... అరడజనుకి తక్కువ కాకుండా రోజుకో వెరైటీ దోసెలు, పెసరట్లు, ఇడ్లీలు లాగించేసే మనిషి ఈ మధ్య వాకింగ్‌కెళ్లి తిరిగొచ్చాక మేకపోతులా పచ్చి కూరగాయ ముక్కలు నమిలేసి కాసింత పలచని మజ్జిగ తాగేసి ఆఫీసుకు పరిగెత్తడం... మళ్లీ సాయంకాలం రాగానే ‘హోహూ’ అంటూ మేడమీద బస్కీలు తియ్యడం... రాత్రిళ్లు ఇదివరకు రెండు కూరలు, పచ్చడి, కమ్మని పెరుగుతో కంచెడు అన్నం లాగించేసే మనిషి రెండు పుల్కాలతో సరిపెట్టుకోవడం... అద్దం ముందు గంటల తరబడి నిలబడి గుప్పెడు వెంట్రుకలు దువ్వుకోవడం మొహాన్ని అటూ ఇటూ మార్చి చూసుకోవడం... ఆయనకి మతిగానీ పోలేదు కదా అనిపిస్తోందావిడకి.



# గులాబీరంగు కవరు



## పారుపూడి వెంకట సత్యనారాయణ


ఇదివరకు నిద్రవచ్చేవరకు తనతో పెళ్లినాటి నుంచి కూతురిని అత్తారింటికి పంపే వరకు ఆ ముచ్చట్లు ఈ ముచ్చట్లు చెప్పేమనిషి మూగ నోము పట్టినట్టు ‘వయసును దాచే చిట్కాలు’ పుస్తకం పట్టుకుని చదువుతూ అలాగే గుండెల మీద పెట్టుకుని నిద్రపోవడం ఆవిడకి విసుగు తెప్పిస్తోంది. అందుకే ఇవాళ బయటికెళ్తోంటే మొగుడి విషయం అటో ఇటో తేల్చుకోవాలనే నిలదీసిందావిడ.

శంకర్రావుగారు పెళ్లాం ప్రశ్నకి సీమ టపాకాయలా ఎగిరాడు. ‘ఆ [illegible]గావూ అపశకునంలా...! మగాడిని బయట వాలక్ష పనులుంటాయి. అవన్నీ నీకు చెప్పే చెయ్యాలా?’

‘అయ్యోరామ! ఇప్పుడు నేనేమన్నానని అంత కోపం? రిటైర్మెంటుకి దగ్గరవుతున్న కొద్దీ మీ చాదస్తం ఇలా పెరిగిపోతోందేమిటి చెప్మా’ అందావిడ మూతి విరుస్తూ.

‘అదిగో... పదే పదే ఆ రిటైర్మెంటు మాటే ఎత్త వద్దంటున్నాను. అక్కడికీ నేనేదో మూడు కాళ్ల ముసలినయిపోయినట్లు దేనికీ పనికి రానట్టు... ఆ మాటలేంటి? అయినా ముందే ఇలా అంటున్నావు. రిటైరయ్యాక ముసుగేసి నన్ను ఓ మూల కూర్చోబెట్టినా ఆశ్చర్యం లేదు’. ఆయనకి కోపం నసాళానికంటింది. ఆవిడకి కళ్లలో నీళ్లు తిరిగాయి. నేరకపోయి ఆ విషయం ఎత్తాను భగవంతుడా అని... ‘ఛ... అవేం మాటలండీ! అయినా మీరెక్కడికెళ్తే నాకెందుకు? మీ కిష్టమయిన చోటికే వెళ్లండి బాబూ!’

ఈ మధ్య కాలంలో శంకర్రావు గారు మరో రెండు నెలల్లో రిటైరవబోతున్నారని తెలిసి ఇరుగూ పొరుగూ... స్నేహితులు బంధువులు, కొడుకులు, కూతుళ్లు... కావాలని కాకపోయినా ఏదో సందర్భంగా ఆ ప్రస్తావన తెస్తూండేసరికి ఆయన ఆవేదనతో అతలాకుతలం అయిపోతున్నారు. ఒకరోజు... కొడుకు పద్మనాభం సాయంత్రం ఆఫీసునుంచి వచ్చేటప్పుడే ఆయాస పడుతూ సంచీడు కూరలు మోసుకు తెచ్చాడు. ...ఎప్పుడూ ఆదివారం రైతుబజారుకెళ్లి వారానికి సరిపడా నవనవలాడే కూరలు ఎంచి తేవడం



శంకర్రావుగారికి అలవాటేమో.... కొడుకు మీద ఎగిరిపడ్డాడు.

'మీకెందుకునాన్నా శ్రమ? ఎలాగూ ఆఫీసు నుంచి వచ్చే దార్లోనేగా మార్కెట్టు... అయినా మీరు రిటైర్....' వాక్యం పూర్తి చెయ్యకుండానే ఆగిపోయాడు పద్మనాభం. ఇంక ఆ రోజు శంకర్రావుగారు చేసిన రాద్ధాంతం అంతా ఇంతా కాదు. 'అంటే అప్పుడే ఇంట్లో నేను పనికిరాని వాడినయి పోయానన్న మాట'.

అలాగే ఆ మధ్య కాస్త కాఫీ డికాషన్ లైట్ అయిందని... 'రిటైరవబోయే మొగుడికి ఈ మాత్రం చాల్లే అనుకుంటున్నావన్నమాట' అంటూ పెళ్లాన్ని ఒకటే చివాట్లు వేయడం... మనవలు ఆటల ధ్యాసలో పడి ఆయన పిలిచినప్పుడు కాస్త వినిపించుకోకపోయినా... కోడలు కూరలో ఉప్పు ఎక్కువ తక్కువలు వేసినా ఈ మధ్య ఆయన ధోరణి పేట్రేగిపోతున్నట్టు ఇలాగే ఉంటోంది.

ఆ మధ్య పక్కింటి కనకారావుగారు సరదాగా 'రిటైరవుతున్నారు కదా హాయిగా తీరిగ్గా పుణ్యక్షేత్రాలు తిరిగిరండి శంకర్రావుగారూ' అన్నాడని ఇంటికొచ్చి హనుమంతుడిలా కుప్పిగంతులు వేసారు. 'ఛ.... ఇంటా బయట అందరికీ లోకువయిపోతున్నాను' అంటూ....

ఎక్కడికీ అని అడిగినందుకు భార్యను కడిగేసాక శంకర్రావు గారు ఇంట్లోంచి బయటపడి వడివడిగా జాగింగ్ చేస్తోంటే గులాబీరంగు కవరు గుర్తొచ్చి ఎవరో చక్కిలిగింతలు పెట్టినట్టనిపించింది ఆయనకి. మనసు పదిరోజుల వెనక్కి వెళ్లింది.

... ఆ రోజు ఆఫీసులో మధ్యాహ్నం పోస్టులో ఆయనకి ఓ గులాబీరంగు రిజిస్టర్ కవరు వచ్చింది. మొదట్లో తనది కాదేమోనని సంశయిస్తోంటే పోస్ట్‌మేన్ ఇంటి పేరుతో సహా మళ్లీ చూసి సంతకం చేయించుకుని మరీ ఆయన చేతిలో పెట్టాడు.

సెంటువాసన వస్తున్న దానిని చూసి 'ఎక్కడ్నుంచండోయ్ శంకర్రావు గారూ!' అన్నాడు పక్క సీట్లో గణపతి అదోలా చూస్తూ....

ఇబ్బందిగా 'ఏమో ఇంకా చూళ్లేదు' అని కవరుని టేబిల్ సొరుగులో పడేసి అంతా లంచ్‌కి వెళ్లిపోయాక కుతూహలంగా తెరిచి ఆశ్చర్య పోయారాయన.

'డియర్ శంకర్‌గారూ! నేనెవరా అనుకుంటున్నారా? నేనెవరైతేనేం లెండి నేను మీ అభిమానిని. మీరంటే ప్రాణం.' ఉలిక్కిపడిన ఆయన గభాలున ఉత్తరం మూసేసి కంగారుగా అటూ ఇటూ చూసారు. చుట్టూ ఎవరూ లేక పోవడంతో మళ్లీ ఉత్తరం చదవడం మొదలెట్టారు.

'ఈ మధ్య మీరు మన సొసైటీ మీటింగులో ఇచ్చిన ఉపన్యాసానికి థ్రిల్లయిపోయానంటే నమ్మండి. మీ చేరువలోనే ఉండి

మిమ్మల్ని రోజూ గమనిస్తూనే ఉన్నాను. మీరంటే నా మనసులో ఎంత ఆరాధనో చెప్పలేను. అసలు ఇన్నేళ్లొచ్చినా మీ బాడీ స్ట్రక్చర్ ఏ మాత్రం చెక్కు చెదరకుండా ఉండడం నాకెంతో ఆశ్చర్యంగా ఉంది సుమండీ... మీరెవరికి చెప్పనంటే... 'ఐ లవ్ యూ సోమచ్....' అనెయ్యాలనిపిస్తోంది. నాకు మీతో డైరెక్టుగానే మాట్లాడాలనుంది కానీ పాడు సిగ్గు ముంచేస్తోంది... నా వయసెంతో అనుకుంటున్నారా? ఊహూ చెప్పను..... ఇదేం ప్రేమ అనకండి... ప్రేమకి వయసుతో సంబంధం లేదని ఓ హిందీ సినిమాలో అమితాబ్‌ను ప్రేమించిన పడుచుపిల్ల చెప్పలేదూ.... అన్నట్టు... మీరు కోప్పడనంటే ఓ సలహా... మీ బాడీ అంతటికీ ఆ పొట్ట మాత్రం కాస్త దిష్టిచుక్కలా ఉందండోయ్.... నాకోసమయినా కాస్త తగ్గించుకునే ప్రయత్నం చెయ్యకూడదు! మళ్లీ త్వరలోనే మరో లెటర్ రాస్తాలెండి...'మీ అభిమాని'.

శంకర్రావుగారి కాలర్ గర్వంతో పైకిలేచింది. చేతి వ్రాతనుబట్టి ఈ ఉత్తరం రాసింది అమ్మాయనే తెలుస్తోంది. పైగా హిందీ.

సినిమాలో పడచుపిల్ల అన్నదీ అంటే... ఆయన మనసు గాల్లో తేలిపోయింది. ఎవరబ్బా.... పది రోజుల క్రితం ఉద్యోగ సంఘాల మీటింగులో తను ఆవేశంగా ఉపన్యసించడం నిజమే... ఎవరా పిల్ల అని ఎంత ఆలోచించినా అంతుపట్టలేదు. తనని ఆట పట్టిస్తున్న జాడలు లేఖలో ఎక్కడా కనిపించక పోవడంతో ఆయన మనసుని అదోరకమయిన హాయి ఆవరించింది. ఎవరూ చూడకుండా బాత్‌రూంలోకి వెళ్లి అద్దంలో తనని తాను చూసుకుంటే తన అందానికి తనకే ముచ్చటేసినా నిజంగానే ఎబ్బెట్టుగా కనిపిస్తోంది పొట్ట.

ఆ ఉత్తరం ఎంత ప్రభావం చూపించిందీ అంటే అదేరోజు ఆఫీసునుంచి వస్తూ దారిలో తను జిమ్‌కెళ్లడం... జిమ్‌కుర్రాడి తెరచిన నోటిని తన చేత్తో మూస్తూ అడిగాడు 'ఈ పొట్ట తగ్గాలంటే ఏం చెయ్యాలి బాబూ? ఎంత ఖర్చయినా పరవాలేదు'.

అతగాడు ముసిముసిగా నవ్వాడు. 'మాస్టారూ.... ఈ వయసులో మిమ్మల్ని మా జిమ్‌కి రమ్మనడం భావ్యం కాదుగానీ... రోజూ పొద్దుటే ఓ గంట జాగింగ్ చెయ్యండి చాలు' అంటూ ఆహార చిట్కాల పుస్తకం కూడా ఇచ్చాడు. ఐదొందలు తీసుకుని రోజూ సాయంత్రం చెయ్యాల్సిన ఎక్సర్‌సైజులు ఓ గంట పాటు నేర్పించాడు. అంతే మర్నాటినుంచీ లేచీ లేవంగానే పరుగులు పెడుతూ.... సాయంత్రాలు బస్కీలు తీస్తున్న తనని చాటుగా చూసి, బుగ్గలు నొక్కుకుంటున్న పెళ్లాన్ని చూసి ముసిముసిగా నవ్వుకుంటున్నాడు. నాలుగడుగులు వేసే సరికి మోకాళ్లు జివ్వుమని లాగేస్తున్నా పట్టు వదల్లేదు. బస్కీలు తీస్తుంటే ఒకటి రెండు సార్లు నడుం కలుక్కుమన్నా ఆయింటుమెంటుతో సర్దుకున్నాడు తప్ప పట్టువదలని విక్రమార్కుడిలా వర్కవుట్లు మానడం లేదు.

## చాలా ఆనందంగా ఉంది



12 జులై 1952న విజయనగరం జిల్లాలోని మామిడిపల్లిలో జన్మించాను. నవ్య పాఠకులకు నేను చిరపరిచితుడనే! గతంలో పలు పత్రికల్లో చాలా కథలకు బహుమతులు అందుకున్నాను. ప్రస్తుతం 'రింగ్‌సైడ్ వ్యూ ఇంగ్లీష్ మంత్లీ'కి ఎడిటర్‌గా పని చేస్తున్నాను. కథానిక శతజయంతి ఉత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో 'నవ్య'లో నా కథకు బహుమతి లభించడం చాలా ఆనందంగా ఉంది.

**-పారుపూడి వెంకట సత్యనారాయణ**

***ప్లాట్ నెం. 31, జర్నలిస్ట్ కాలనీ, మద్రిపాలెం, వుడా లే అవుట్, ఎస్.ఎ.డి. పోస్టు, విశాఖపట్నం - 9***

***

ఈ మధ్య రోజూ మధ్యాహ్నమయ్యే సరికి లంచ్‌కి ముందు ఆఫీసులో గులాబీ రంగు కవరు కోసం ఎదురు చూడడం అలవాటయింది శంకర్రావు గారికి. పదిహేను రోజుల తర్వాత మళ్లీ గులాబీరంగు కవరు వచ్చింది. తెరిచేసిన గణపతి నోట్లోకి ఈగలు దూరకుండా శంకర్రావుగారే మూసేసి... 'ఏదో మావాళ్లే' అన్నాడు. కానీ ఏదో ఉందనిపించినా మొహమాటం కొద్దీ నోరెత్తలేక పోయాడు గణపతి. శంకర్రావుగారు ఆపూట తలనెప్పిగా ఉందంటూ సెలవుపెట్టి ఆఫీసునుంచి బయటపడి దారిలో పార్కులో కూర్చుని ఉత్తరం చదువుకుని తనలో తనే నవ్వుకున్నారు.

'మైడియర్ శంకర్! ఇలా సంబోధించాలనిపించేంత ప్రోగ్రెస్ కనిపిస్తోంది మీలో... నా సలహా పాటించినందుకు మెనీమెనీ థాంక్స్... మీ వయసు ఓ ఇరవై తగ్గిపోయింది సుమండీ... గుడ్ ప్రోగ్రెస్... అయితే సాధారణంగా నలభై లోపే ఈ కాలం వాళ్లకి తల సగం బోడి అయిపోతోంది. కాని మీరేం పుణ్యం చేసారో గాని అంత బాగా జుట్టెలా మెయిన్‌టెయిన్ చేస్తున్నారండీ బాబూ!... కానయితే వెండి తీగల్లాంటి ఆ రంగు ఒక్కటే ఆలోచించాల్సిన విషయం.... దానిదేముంది లెండి? ఈ కాలం కుర్రకారు... ఉన్న నల్ల జుట్టుకే రకరకాల రంగులు వేసుకోవడం లేదూ? మీరు డై చేసుకుంటే తప్పేమిటంట... నా కోసం... కేవలం నాకోసం ఈ చిన్న కోరికను కాదనరనుకుంటాను. అయితే కెమికల్స్ కంటే గోరింటాకు అయితే ఎలాంటి ఎలర్జీకి తావుండదు. ఏమంటారు శంకర్? మళ్లీ త్వరలోనే కలుద్దాం... మీ ప్రియ... అభిమాని....'

ఒకటికి పదిసార్లు ఆలోచించినా రంగేసుకోవడం వైపే మనసు మొగ్గింది శంకర్రావుగారికి... అంతే ఆరోజు సాయంత్రం మగవాళ్ల బ్యూటీ క్లినిక్‌లో కూర్చున్న శంకర్రావుగారిని చూసి ముసిముసిగా నవ్వుతూనే ఓ రెండు గంటల సమయంలో శంకర్రావుగారికి తనని చూసి తనకే నమ్మకం కుదరనంత నవ మన్మధుడిలా తయారుచేసాడు అక్కడి కుర్రాడు.

అద్దంలో నిగనిగలాడే నల్లని క్రాపుతో ఉన్న తన ప్రతిబింబం చూసుకుని హుషారుగా విజిల్ వచ్చింది ఆయన నోట్లోంచి.... ఆయన ఇంటిరి రాగానే తలుపుతీసిన కామేశ్వరమ్మ గారు భర్తను గుర్తుపట్టలేదు. భుజం చుట్టూ కొంగును నిండుగా కప్పుకుని... 'ఎవరు కావాలి బాబూ.... మా అబ్బాయి స్నేహితుడివా? కోడల్ని పుట్టింట్లో దింపడానికి కాకినాడ వెళ్లాడు రేపురా నాయనా!' అంది.

శంకర్రావుగారు సంతోషం పట్టలేక లోపలికొచ్చి 'కాముడూ' అంటూ ఆవిడను పట్టుకుని ఊపేస్తుంటే... ఆవిడ భయపడిపోయి... అంతలోనే గుడ్లెర్రచేసి... 'నీకేం పొయ్యే కాలంరా... ఎవరునువ్వు? వదులు ముందు... నేరకపోయి తలుపు తీసాను నాయనోయ్...' అంటూ లబలబలాడింది.

'నేనేనే కాముడూ' అంటున్న భర్తను పరకాయించి చూసి ఓ క్షణం కళ్లు తేలేసింది ఆవిడ. కాసేపయ్యాక తేరుకుని ఆశ్చర్యపోతూ.... 'మీ యిల్లు బంగారం కానూ... ఏమిటీ శోభనం పెళ్లి కొడుకులా తయారయ్యారు' అంటూ సిగ్గుతో భార్య మెలికలు తిరిగిపోతుంటే రంగు వేసుకున్న మీసం మెలేసాడాయన గర్వంగా.

***

నెల్లాళ్ల తర్వాత.... ఆయనను ఎంతో గౌరవించే ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో చాలా గ్రాండ్‌గా జరిగింది పదవీ విరమణ వీడ్కోలు. దండలతో ఆయనను ముంచెత్తేస్తూ సహోద్యోగులంతా ఆయన పనితనంతో బాటు ఆయన అందాన్నీ ఆరోగ్యాన్నీ ఆకాశానికెత్తేసారు. ఆయన మనసు తృప్తితో నిండిపోయింది. ఆయన కళ్లు మాత్రం ఎవరికోసమో వెతుకులాడుతూనే ఉన్నాయి. గణపతి ఆయన్ని మర్యాద పూర్వకంగా ఇంటి దగ్గర దింపుతూంటే ఏదో చెప్పాలని నోరు తెరిచారు శంకర్రావుగారు.

'మీకేదన్నా గులాబీరంగు కవరు అదే... ఉత్తరం వస్తే భద్రంగా నేనింటికి తెచ్చి ఇస్తాన్లెండి శంకర్రావుగారూ' అన్నాడు గణపతి గుంభనంగా

నవ్వుతూ....

మర్నాడు మధ్యాహ్నం భోజనం చేస్తోంటే పోస్ట్‌మేన్ తలుపు కొట్టాడు. గులాబీ రంగు కవరును చూసి ఒక్క క్షణం ఆనందంతో నిండిపోయింది శంకర్రావుగారి హృదయం. ఇంటి అడ్రసు కూడా తెలుసుకుందీ ఈ పిల్ల అంటే... హిపిప్ హుర్రే... స్వీట్ నథింగ్స్ ఊహించుకుంటూ... పెద్దగా విజిల్ వేసి... తన గదిలోకి వెళ్లి తలుపేసుకుంటున్న మొగుడిని చూసి విస్తుపోయింది కామేశ్వరమ్మగారు.

ఉత్తరం చదువుకున్న శంకర్రావుగారు నోరు ఆశ్చర్యంతో ఆనందంతో అలాగే ఉండి పోయింది.

'ఒరేయ్ శంకరం! నేనురా నీ అభిమానిని. చిన్ననాటి నేస్తాన్ని.... నీ కంటే రెండేళ్లు ముందర రిటైరయిన సుబ్బారావుని...

జీవితంలోను ఉద్యోగంలోను పదవీ విరమణ అనేది ఎవరికయినా తప్పనిదిరా. పరిపూర్ణంగా సర్వీసు ముగించిన మనల్ని చూసి మనం గర్వపడాలిగాని రిటైర్మెంటుని తలుచుకుని అనారోగ్యం పాలయితే ఎలా? రిటైర్మెంటు దగ్గరవుతున్న కొద్దీ నువ్వు చిటపటలాడడం చూసి నీ ఆరోగ్యం ఏమయి పోతుందోనని మా చెల్లెలు కామేశ్వరమ్మ... లేనిపోని ఒత్తిడితో నువ్వెక్కడ బిపి, షుగర్‌లు తెచ్చుకుంటావోనని నీ కొడుకు పద్మనాభం ఎంత తల్లడిల్లిపోయారను కున్నావ్? అంతగా ప్రేమించే కుటుంబం నీకున్నందుకు గర్వపడాలిరా శంకర్! ఎవరు ఎలా చెప్పినా నీ మనసుకెక్కడం లేదనే... ఈ గులాబీరంగు కవరు ట్రీట్‌మెంటు.

వయసు పెరుగుతున్న కొద్దీ ఆహారం తగ్గిస్తూ, తగిన వ్యాయామాలు చేస్తుంటే... అనారోగ్యం మన దగ్గరికి రమ్మన్నా రాదు. ఈ వయసులో ఆరోగ్యాన్ని మించిన మహాభాగ్యం ఏముంటుంది చెప్పు? పరిపూర్ణమయిన నీ వయసు, అనుభవాలను అవసరమైనప్పుడు సలహాల రూపంలో నలుగురికీ పంచుతూ... మరో బాల్యంలోకి అడుగుపెట్టి పదవీ విరమణ తర్వాతి సమయాన్ని నీ మనవలతో ఆనందంగా నాలాగే తీర్చిదిద్దుకుంటావని ఆశిస్తూ....

నీ అభిమాన నేస్తం సుబ్బు'

ఆ సాయంకాలం అమ్మమ్మావాళ్ల ఊరి నుంచి సెలవు అయ్యాక తిరిగొచ్చిన మనవలిద్దరూ.... తాతయ్యను చూసి ''హిప్పిప్ హుర్రే.... తాతయ్యా... నువ్వెంత స్మార్ట్‌గా ఉన్నావో? ఇప్పుడింక నీకు మాకు కథలు చెప్పే తీరిక దొరికిందటగా డాడీ చెప్పారు. నువ్వెప్పుడూ ఇలాగే ఉండాలి తాతయ్య' అంటూ తనను వాటేసుకుంటూంటే ఆనందంగా గుండెకు హత్తుకున్నారు శంకర్రావు గారు.

మర్నాడు ఆఫీసుకెళ్లే పనిలేక పోయినా పొద్దుటే వాకింగ్‌కు బయలుదేరిన తండ్రిని చూసి తృప్తిగా నిట్టూర్చాడు పద్మనాభం. యధాప్రకారం బుగ్గన వేలేసు కోలేదు కామేశ్వరమ్మగారు. రాత్రి కోడలుచేసిన హితబోధ ఆవిడలోను ఆలోచన రేపింది. అవును ఆయన కుర్రాడిలా తయారవుతుంటే... తను లావుగా... ఇలా శరీరాన్ని పెంచుకోవడం ఏంబాగు.....?

కోడలు కొనిచ్చిన కొత్తవాకింగ్ సూటు, చెప్పులూ వేసుకుని తన వెనకే పరిగెడుతున్న పెళ్లాన్ని చూసి ముందు విస్తుబోయినా తర్వాత ముసిముసిగా నవ్వుకున్నారు శంకర్రావుగారు... సాయంత్రం తనతోబాటు ఎక్సర్‌సైజ్‌లు కూడా చెయ్యబోయే కామేశ్వరమ్మ ఎలా ఉంటుందోనని ఊహించుకుంటూ... ఉన్నట్టుండి 'దీనికి ఏ గులాబీరంగు కవరో రాలేదు కదా!' అన్న ఆలోచన బుర్రలో మెరిసి 'హ హ హ్హా' అంటూ రోడ్డు మీదే గట్టిగా నవ్వుతున్న మొగుడిని కోరగా చూసింది కామేశ్వరమ్మగారు....

*

## మనమీదేపర్లోయ్!

సరసి



